




# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 29-03-2024 సంపుటి : 06 సంచిక : 199 పేజీలు : 8 వెల : రూ 3-00



## ఆళ్లగడ్డలో సీఎం జగన్ సమక్షంలో వైసీపీ పార్టీలో చేరిన పలువురు టీడీపీ నేతలు.



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28 – వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, అఖిలభారత బ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు కాశీభట్ల సాయినాథ్ శర్మ, టీడీపీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆర్టీసీ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, బనగానపల్లె నియోజకవర్గం కోయిలకుంట్ల మేజర్ పంచాయితీ మాజీ సర్పంచ్ వీ ఎస్ కృష్ణమూర్తి(లాయర్ బాబు) సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు

# ప్రజల భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు

## సీఎం జగన్ మోహన్ రెడ్డి





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28 –నంద్యాల పట్టణం లో గురువారం జరిగిన మేము సిద్ధం కార్యక్రమం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బారి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో సీఎం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు మనకు జైత్రయాత్ర అని ఐదేళ్ల పాలనలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారు. లంచాలు, వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందించాం అని అన్నారు. ఐదేళ్లలో గ్రామాల్లో వచ్చిన మార్పును గమనించండి . వైసీపీ ఐదేళ్ల పాలనపై అందరితోనూ చర్చించండి..ఈ ఎన్నికలు ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఇటు జగన్ ఒక్కడు.. అటు చంద్రబాబు, దత్తపుత్రుడు, బీజేపీవీరికి కాంగ్రెస్ పార్టీ కూడా తోడైందని అన్నారు. పేదలను మళ్లీ చీకట్లోకి తీసుకెళ్లేందుకే ప్రత్యర్థి పార్టీల పొత్తులుపొత్తు కుట్రలను ఎదుర్కొనేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ ఎన్నికలో తేడా జరిగితే పేద వాడి జీవితం ఆగమైపోతుందదన్నారు. మనం గెలిచి పేదవాడిని గెలిపిద్దాం అని సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. చంద్రబాబు పేరుచెబితే గుర్తుకొచ్చేది కరువు అని అన్నారు. పేదల గుండెల్లో చోటుకోసం నా తాపత్రయం అని అన్నారు. నరకాసురుడు,(చంద్రబాబు )రావణాసురుడు,(పవన్ కళ్యాణ్ ) దుర్యోదనుడు (జాతీయ బీజేపీ ) కలిశారు. చంద్రబాబు జిత్తులమారి, పొత్తుల మారి అని అన్నారు. ఈ సభలో నంద్యాల జిల్లా లో వైసీపీ తరుపున పోటి చేస్తున్న అభ్యర్థులు. నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హంతకులకు ఓటేయొద్దు

మరోమారు వివేకా తనయ వినతి
ఐదేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతన్న పట్టించుకోని జగన్
అన్న అంటే చెల్లెలుకు చేసే న్యాయం ఇదేనా
వివేకా కుమార్తె సునీత ప్రశ్న



హైదరాబాద్,మార్చి 28: హంతకులకు ఓటు వేయవద్దని మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీత మరోమారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ హైకోర్టు వద్ద గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సీఎం జగన్ ప్రొద్దుటూరు సభలో చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. చిన్నాన్న అంటే అర్థం తెలుసా? నాన్న తర్వాత నాన్న.. అలాంటి వ్యక్తిని చంపితే కుట్రను ఛేదించలేదు. పైగా.. చిన్నాన్న కుమార్తెపైనే నిందలు వేయడం న్యాయమా? మీ చెల్లి కోర్టులు, పోలీసుల చుట్టూ తిరుగుతుంటే అన్నగా మీ బాధ్యత ఏంటి? బంధుత్వాలకు అర్థం తెలుసా? చిన్నాన్నను ఎవరు చంపారో దేవుడికి తెలుసు, జిల్లా ప్రజలకు తెలుసు అంటున్నారు. అవును మీరు నిజమే చెప్పారు. వివేకాను చంపించింది ఎవరో.. దేవుడికి, మీకు, జిల్లా ప్రజలకు తెలుసు. అందుకే నిందితులను అంత బాగా రక్షిస్తున్నారని ఎద్దేవా చేశారు. హంతకుడే చెబుతున్నాడు.. వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డే వివేకాను హత్య చేయించారని. ఒకరు చెప్పింది నమ్ముతున్నారు.. ఇంకొకరు చెప్పింది నమ్మడం లేదు. ఐదేళ్లు మీ ప్రభుత్వం ఉండి కూడా ఏం చేశారు? నిందితులను రక్షించేది మీరు కాదా? గతంలో సీబీఐ విచారణ కోరింది మీరే.. ఆ తర్వాత పిటిషన్ ఉపసంహరించుకున్నదీ మీరే. ఎన్నికలు వస్తున్నాయని ఐదేళ్ల తర్వాత చిన్నాన్న గుర్తొచ్చారా? మీరు చేయాల్సిన పని సరిగా చేయనందుకే బయటకు రావాల్సి వచ్చింది. ఎవరు స్వార్థపరులు? ఎవరు పదవుల కోసం హత్య కేసును వాడుకుంటున్నారు. హంతకులకు ఓటు వేయమని మీరు అడుగుతున్నారు. సినిమాలో రౌడీలు ఉంటారు, విలన్ ఉంటాడు. కేవలం రౌడీలను పట్టుకుంటే సరిపోతుందా? విలన్‌ను కూడా పట్టుకోవాలి కదా. చిన్నాన్న చనిపోయి ఐదేళ్లు అవుతోంది. సానుభూతి పొంది ఎన్నికల్లో ఓట్ల కోసం పాకులాడుతున్నారు. తండ్రిని కోల్పోయి నేను న్యాయం కోసం పోరాడుతున్నా. హంతకులకు ఓటు వేయవద్దని మరోసారి ప్రజలను కోరుతున్నా. పదవుల కోసమని నాపై ఆరోపణలు చేస్తున్నారు. న్యాయం కోసం, ధర్మం కోసం నేను పోరాడుతున్నా. సానుభూతి కోసమే ఎన్నికల వేళ చిన్నాన్నను జగన్ తెరపైకి తెస్తున్నారు. వైకాపా పునాదులు వివేకా రక్తంలో మునిగి ఉన్నాయి' అని సునీత ఆవేదన వ్యక్తం చేశారు.

# వైకాపా పని అయిపోయింది



విధ్వంసం అయిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తాం
అనంత జిల్లాలో ప్రజాగళం సభల్లో చంద్రబాబు



అనంతపురం,మార్చి 28(): వైకాపా ప్రభుత్వం పని అయిపోయిందని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు ఎన్డీయే కూటమికి మద్దతివ్వాలని కోరారు. విధ్వంసమైన రాష్ట్రాన్నిగాడిలో పెట్టేందుకు మాకు మద్దతివ్వండి. అక్రమ కేసులు, బెదిరింపులకు ఎవరూ భయపడొద్దన్నారు. 'ప్రజాగళం' యాత్రలో భాగంగా అనంతపురం జిల్లా రాప్తాడు తదితర ప్రాంతాల్లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. 90 శాతం హామీలు నెరవేర్చానని చెబుతున్న జగన్.. తన 7 ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ప్రత్యేకహోదా, సీపీఎస్ రద్దు, మద్య నిషేధం, ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, కరెంటు ఛార్జీల తగ్గింపు, పోలవరం పూర్తి తదితర హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. గోదావరి జలాలను రాయలసీమకు తీసుకొచ్చే బాధ్యత తమదని చెప్పారు. సీమను తాము హార్టికల్చర్ హబ్‌గా చేస్తే.. రాజకీయ హత్యలతో సైకో రాజ్యంగా జగన్ మార్చారని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్ కోసం మూడు పార్టీలు కలిశాయి. గత ఎన్నికల్లో (రాయలసీమలోని 52 సీట్లలో 49 చోట్ల వైకాపాను గెలిపిస్తే ఏం ఒరగబెట్టారు? ఈసారి 52 చోట్లా కూటమి అభ్యర్థులను గెలిపించాలి. తన చర్యలతో రాష్ట్రాన్ని జగన్ లూటీ చేశారు. అసమర్థుడు, అవినీతిపరుడిని ఇంటికి పంపాలి. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. విద్యుత్ ఛార్జీలు, మద్యం ధరలను అమాంతం పెంచేశారు. నాసిరకం మద్యంతో అనారోగ్యం పాలయ్యే పరిస్థితి తీసుకొచ్చారు. ఆఖరికి ఇసుక పైనా దోపిడీ చేశారు. భవన నిర్మాణ కార్మికులను నాశనం చేశారు. ఇసుక దొరక్క భవన నిర్మాణ రంగం కుదేలైంది. నిరుద్యోగులను నిలువునా ముంచేశారు. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా మోసం చేశారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేకహోదా తెస్తా అన్నారు.. తెచ్చారా? మద్యపాన నిషేధం చేయకపోతే 2024 ఎన్నికల్లో ఓట్లు అడగను అన్నారు.. చేశారా? సీపీఎస్ రద్దు చేశారా? ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ ఇచ్చారా? పోలవరం పూర్తి చేశారా?' అని చంద్రబాబు నిలదీశారు.తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రజాగళం యాత్ర లో భాగంగా గురువారం అనంతపురం జిల్లా, రాప్తాడులో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిన్నటి వరకు అధికార పార్టీవాళ్లు బెదిరించారని.. కేసులు పెట్టారని.. ఇవాళ ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తల ప్రాణానికి తన ప్రాణం అడ్డువేస్తానన్నారు. సీఎం జగన్ సిద్ధం కార్యక్రమం ఎ÷–లాప్ షో అయిందని, డబ్బులు ఇచ్చి.. బిర్యానీలు పెట్టినా జనం రావట్లేదని ఎద్దేవా చేశారు.

## జగన్ ముఖాముఖిలో అఖిలప్రియకు నో పర్మిషన్

### అఖిలను అడ్డుకున్న పోలీసులు

నంద్యాల,మార్చి 28(: ఎర్రగుంట్లలో జనంతో సీఎం జగన్ ముఖాముఖి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. సీఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు మాజీమంత్రి భూమా అఖిల ప్రియ వచ్చారు. ఆమెకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. భూమా వర్గీయులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన రైతులపై ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి చేయి ఎత్తారని భూమా అఖిల ఆరోపిస్తున్నారు. రైతులతో ముఖాముఖి సభలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన భూమా అఖిలప్రియ వర్గంపై ఎమ్మెల్యే గంగుల నాని వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. ఈ క్రమంలోనే టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో భూమా అఖిల ప్రియని అరెస్ట్ చేసి,శిరివెళ్ల స్టేషన్‌కు పోలీసులు తరలించే యత్నం చేశారు. పోలీసుల వాహనం ఎక్కేందుకు భూమా అఖిలప్రియ నిరాకరించారు. శిరివెళ్ల పోలీస్ స్టేషన్ కు నడుస్తూ వస్తానంటూ స్టేషన్‌కు అఖిల ప్రియ బయలుదేరారు. జగన్‌ను కలిసేందుకు వచ్చిన తనను అడ్డకోవడంపై అఖిల ప్రియ ÷ర్ అయ్యారు. ముందుగానే ఎస్పీ వద్ద పర్మిషన్ తీసుకున్నామని ఇప్పుడు ఎందుకు అడ్డకుంటున్నారని నిలదీశారు. సమస్యలు ఉంటే చెప్పండి అని జగన్ అంటూ ఉంటే... పోలీసులు మాత్రం తమను వెళ్లనీయకపోవడంపై మండిపడ్డారు. గన్‌ను కలిసేందుకు అనుమతి లేదంటూ సభా ప్రాంగణానికి దూరంలోనే నిలిపివేసిన పోలీసులు అఖిల ప్రియతో చర్చలు జరిపారు. కేవలం నలుగురిని మాత్రమేఅలా నలుగురి వివరాలు తీసుకొని సీఎంను కలిసేందుకు వెళ్లారు. అక్కడ మరో డ్రామా నడిచిందని అఖిల ప్రియ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు చెప్పేందుకు వెళ్లిన రైతులను స్థఆనిక ఎమ్మెల్యే అనుచరులు కొట్టి పంపిచారని ఆరోపించారు.

# కేజ్రీవాల్‌కు మరో నాలుగు రోజుల కస్టడి



ఏప్రిల్‌1న కోర్టు ముందు ప్రవేశ పెట్టాలని ఆదేశం
దేశం ముందు ఆప్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నం
ఇదంతా రాజకీయ కుట్ర అన్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ,మార్చి 28: దిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈడీ కస్టడీని దిల్లీ న్యాయస్థానం మరో నాలుగు రోజుల పాటు పొడిగించింది. ఏప్రిల్ 1వరకు ఆయన్ను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ నిర్ణయం వెల్లడించింది. గతంలో విధించిన ఏడు రోజుల కస్టడీ గురువారంతో ముగియడంతో ఈడీ అధికారులు ఆయన్ను రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఎదుట హాజరుపరిచారు. మద్యం కేసులో కేజ్రీవాల్‌ను ఇంకా విచారించేందుకు మరో ఏడు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని ఈడీ కోరగా.. నాలుగు రోజుల పాటు కస్టడీకి అనుమతించారు. ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 11గంటలకు తమ ఎదుట హాజరు పరచాలని ఆదేశించారు. కేజ్రీవాల్‌ను విచారించే సమయంలో ఐదు రోజులు స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశామని.. ఆయన దాటవేత సమాధానాలను చెబుతున్నారని ఈడీ ఆరోపించింది. డిజిటల్ పరికరాల పాస్‌వర్డ్‌లను ఆయన వెల్లడించలేదని రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. అదే సమయంలో మరో ముగ్గురు వ్యక్తుల వాంగ్మూలాలను సైతం రికార్డు చేసినట్లు తెలిపింది. అంతకముందు కేజ్రీవాల్ స్వయంగా కోర్టులో తన వాదనలు వినిపించారు. ఈ కేసులో తన పేరును నలుగురు సాక్షులు మాత్రమే ప్రస్తావించారని.. ఒక సీఎంను అరెస్టు చేసేందుకు ఆ వాంగ్మూలాలే సరిపోతాయా? అని 'ఈడీ'ని ఉద్దేశించి ప్రశ్నించారు. దేశం ముందు 'ఆప్'ను ఓ అవినీతి పార్టీగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈడీ విచారణను ఎదుర్కొనేందుకు తాను సిద్ధమేనని ఈ సందర్భంగా కేజ్రీవాల్ అన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 29-03-2024

## ప్రతి ముగ్గురిలో ఒకరికి సీట్ కట్

కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల తేదీలను ప్రకటించక ముందే 195 మందితో తొలి జాబితాను విడుదల చేసిన భారతీయ జనతా పార్టీ ఇప్పటి వరకు నిన్న విడుదల చేసిన 7వ జాబితాతో కలిపితే మొత్తం 410 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మిత్రపక్షాలతో కలిసి 'మిషన్ 400 ప్లస్' అనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, అందులో తన వాటాగా 'టార్గెట్ 370' సాధించాలని చూస్తున్న ఆ పార్టీ.. ఏకంగా సుమారు 108 మంది సిట్టింగ్ ఎంపీలకు 'నో' చెప్పింది. అంటే 2019లో గెలుపొందిన 303 మందితో పోల్చితే దాదాపు మూడో వంతు. అంటే ప్రతి ముగ్గురు బీజేపీ ఎంపీల్లో ఒకరిని కట్ చేసింది. తెలంగాణలోని నలుగురు బీజేపీ ఎంపీల్లో ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకు టికెట్ నిరాకరించిన ఉదాహరణ మన కళ్ల ముందే ఉంది. దేశవ్యాప్తంగా ఇదే తరహా కసరత్తు జరిగిందని సంఖ్యను చూస్తే అర్థమవుతోంది. సిట్టింగ్ ఎంపీలకు సీట్లు కట్ చేయడం ఒకెత్తయితే.. ప్రత్యర్థుల కంటే చాలా ముందుగానే అభ్యర్థులను ప్రకటించడం మరో ఎత్తు. మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో మిత్రపక్షాలకు పోను బీజేపీ సొంతంగా 440-450 స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంది. వాటిలో ఇప్పటి వరకు 405 స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసి జాబితా కూడా విడుదల చేసింది. ఈ లెక్కన చూస్తే అభ్యర్థుల ఎంపికలో బీజేపీ ఇప్పటికే 90 శాతం కసరత్తు పూర్తి చేసింది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుపుకున్న మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఇదే వ్యూహాన్ని అనుసరించి, తాము ఇంతవరకు గెలవలేకపోయిన నియోజకవర్గాలతో పాటు వరుసగా ఓడిపోతూ వచ్చిన నియోజకవర్గాల్లో మెరుగైన ఫలితాలు సాధించగలిగింది. అంతిమంగా ఆ మూడు రాష్ట్రాల్లోనూ కమలదళం విజయం సాధించి ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలిగింది. ఇప్పుడు జాతీయస్థాయిలో ఈ వ్యూహాన్ని అమలు చేస్తూ గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని భావిస్తోందిఎంత గొప్ప పాలన అందించినా.. సమాజంలోని అన్ని వర్గాలను సంతృప్తిపర్చడం సాధ్యం కాదు. పదేళ్లుగా వరుసగా అధికారంలో ఉన్న పార్టీ పట్ల ఓటర్లలో సహజంగా ఎంతో కొంత వ్యతిరేకత ఏర్పడుతుంది. ఆ వ్యతిరేకతలో స్థానిక ప్రజా ప్రతినిధుల పనితీరు కూడా ఒక భాగం. కొన్ని సందర్భాల్లో ముఖ్యమంత్రి పాలనపై ప్రజలు సంతృప్తిగానే ఉన్నా.. స్థానిక ఎమ్మెల్యేల తీరు నచ్చక ప్రత్యర్థి పార్టీకి ఓటేసిన సందర్భాలు ఉన్నాయి. ఎక్కడైతే స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో లేకుండా ఉంటారో, ప్రజలు ఏవగించుకునేలా వ్యవహరిస్తారో.. అక్కడ ఈ తరహా భావన ఏర్పడుతూ ఉంటుంది. తెలంగాణలో వరుసగా 9 సంవత్సరాలు పాలన అందించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఓటమికి దారితీసిన కారణాల్లో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న అభ్యర్థులను సైతం మార్చకపోవడం ఒకటని రాజకీయ విశ్లేషకులు చెబుతూ ఉంటారు. ఇలాంటి ఉదాహరణలు మనకు దేశవ్యాప్తంగా చాలానే కనిపిస్తాయి. అభ్యర్థులను మార్చడం ద్వారా ఈ వ్యతిరేకతను ఎదుర్కోవచ్చు అనేది పార్టీ అధినేతల వ్యూహంగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా మూడొంతుల మంది సిట్టింగ్ ఎంపీలకు టికెట్లు నిరాకరించడం వెనుక కూడా ఇదే కారణమని కమలదళం వర్గాలు చెబుతున్నాయి.సిట్టింగ్‌లను మార్చడంలో బీజేపీ ఒక పద్ధతిని అనుసరించింది. వయోధికులు, వరుసగా 3 సార్లు లేదా అంతకంటే ఎక్కువసార్లు గెలిచినవారికి టికెట్లు నిరాకరించింది. తద్వారా ఆయా స్థానాల్లో తర్వాతి తరం నేతలకు అవకాశం దొరికింది. ఇది కార్యకర్తల్లోనూ కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. లేదంటే కొన్ని నియోజకవర్గాల్లో ఒక కుటుంబమే దశాబ్దాలుగా పాతుకుపోయి కూర్చుంటుంది. దాంతో ఆ నియోజకవర్గంలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అవకాశం దొరక్కుండా పోతుంది. సిట్టింగ్ ఎంపీలనే కాదు, కొద్ది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన మధ్యప్రదేశ్‌లో సుదీర్ఘకాలం సీఎంగా ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్‌నే మార్చేసింది. అలాగే రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సామాన్య నేతలను సింహాసనం ఎక్కించి ముఖ్యమంత్రులను చేసింది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీలను కాదని కొత్తవారికి టికెట్ ఇవ్వడం ద్వారా పార్టీ కార్యకర్తలకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో తెలియజెప్పే ప్రయత్నం చేస్తోంది.అలాగే తరచుగా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ యావత్ పార్టీకే మచ్చ తెచ్చేలా ప్రవర్తించిన సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, రమేశ్ బిదూరి, పర్వేష్ సింగ్ సాహిబ్ వర్మ, వరుణ్ గాంధీ, అనంత్ కుమార్ హెగ్డే వంటి సిట్టింగ్ ఎంపీలకు కూడా బీజేపీ నాయకత్వం నిర్మొహమాటంగా నో చెప్పేసింది. పార్టీకి నష్టం కల్గించే చర్యలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తుంది అన్న బలమైన సందేశాన్ని కూడా పంపింది.బీజేఏకాంగ్రెస్ ఇప్పటి వరకు కేవలం 190 మందిని మాత్రమే ప్రకటించి వెనుకంజలో ఉంది. అభ్యర్థుల ఎంపికలో జరుగుతున్న జాప్యానికి కారణం ఆయా రాష్ట్రాల్లో ఉన్న అంతర్గత కుమ్ములాటలతో పాటు విపక్ష కూటమిలోని పార్టీలతో పొత్తులు, సీట్ల సర్దుబాటు వ్యవహారం తేలకపోవడం వంటివి కారణాలుగా కనిపిస్తున్నాయి. నియోజకవర్గాల్లో ప్రత్యర్థి బీజేపీ ప్రచారంలో నాలుగు అడుగులు ముందుంది. టికెట్లు ఖరారైన అభ్యర్థులు ఇప్పటికే విస్తృతంగా ప్రచారం చేసుకుంటూ ఉంటే, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం దేశవ్యాప్తంగా పర్యటిస్తూ బిజీగా ఉన్నారు. ఉత్తరాదిన పెద్ద పండుగల్లో ఒకటిగా ఉన్న హోలీని సైతం ఓటర్లతో కలిసి జరుపుకుంటూ, సంబరాలు, వేడుకల్లో వారిని భాగస్వామ్యం చేస్తూ ముందుకెళ్తోంది.

# ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

**కర్నూల్ జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్.**

**ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే పోలీసుల కవాతు....**

**ప్రశాంత ఎన్నికలే లక్ష్యం**



కర్నూలు జిల్లా ప్రతినిధి మార్చి 28 విభారె న్యూస్..జిల్లాలోని పలు ప్రాంతాలలో కేంద్ర సాయుధ బలగాల తో పోలీసుల కవాతు.ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారని కర్నూల్ జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ ఐపియస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు,ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహక రించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసుయంత్రాంగంసహకారం ఎల్ల వేళలా ఉంటుందని జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ఐపియస్తెలిపారు. గురు వారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోనికర్నూలు,ఆదోని సబ్ డివి జన్ లలోని పలు ప్రాంతాలలో కేంద్ర సాయిధబలగాలైన"సశస్త్ర సీమా బల్" సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు.కర్నూలుమూడవ పట్ట ణ పోలీసుస్టేషన్ పరిధిలోని కర్నూలు పట్టణంలోనిఅమ్మహాస్పిటల్, సాంస్కృ తి పార్క్, డాక్టర్స్ కాలనీలలో కేంద్ర సాయుధబలగాలతోపోలీసులు కవా తు నిర్వహించారు. కర్నూలు త్రీ టౌన్ ఎస్సై వెంకటసురేష్ పోలీసు సిబ్బంది ఉన్నారు.ఆదోనిరెండవపట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆదోని పట్టణం లో భీమాసర్కిల్,ఫరిద్‌సాహెబ్ మొహల్లా, మట్కగేరి, చిన్న మార్కెట్, చాంద్ సౌ దర్గా, ఎస్ కె డి కాలనీ లలో కవాతు నిర్వహించారు.ఎస్ ఎస్ బి అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్, ఆదోని టూ టౌన్‌సిఐ డి.గోపి సిబ్బంది పాల్గొన్నారు


# కంగనాపై అసభ్య పోస్ట్.. సుప్రియాకు షాకిచ్చిన కాంగ్రెస్



న్యూఢిల్లీ: సినీ నటీ, హిమాచల్ ప్రదేశ్‌లోని మండి బీజేపీ లోక్‌సభ అభ్యర్థి కంగనా రనౌత్‌పై సోషల్ మీడియా వేదికగా చేసిన అసభ్యకర వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనతే భారీ మూల్యం చెల్లించుకున్నారు.కాంగ్రెస్ పార్టీ బుధవారం విడుదల చేసిన లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల జాబితాలో సుప్రీయా శ్రీనతేకు టికెట్ నిరాకరించింది.2019లో సుప్రీయా శ్రీనతే ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈసారి కూడా మహారాజ్‌గంజ్ నుంచి తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయిస్తుందని సుప్రియా శ్రీనతే ఆశాభావం వ్యక్తం చేశారు. 2019లో సుప్రియా శ్రీనతేపై బీజేపీ అభ్యర్థి పంకజ్ చౌదరీ విజయం సాధించారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఈసారి మహారాజ్‌గంజ్‌లో వీరేంద్ర చౌదరీని బరిలోకి దింపింది.సుప్రియా శ్రీనతే సోషల్ మీడియా ఖాతా నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి కంగనా రనౌత్‌పై వెలువడిన అసభ్యకరమైన విమర్శలు కాస్త వివాదం రేపాయి. అయితే ఈ నేపథ్యంలో ఆమెకు కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈసారి తాను లోక్ ఎన్నికల్లో పోటీ చేయనని కాంగ్రెస్ పార్టీని కోరినట్లు తెలిపారు. అయితే తన స్థానంలో మరో అభ్యర్థి పేరును సూచించినట్లు సుప్రియా పేర్కొన్నారు.కంగనాపై చేసిన అసభ్యకరమైన పోస్ట్‌పై.. సుప్రియా శ్రీనతే వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు. తన సోషల్ మీడియా ఖాతాల పాస్‌వర్డులు పలువురికి తెలుసని తనకు తెలియకుండానే కంగనాపై అసభ్యకరమైన పోస్ట్ వేశారని తెలిపారు. ఈ పోస్ట్ తన దృష్టికి రావటంతో డిలీట్ చేశానని తెలిపారు.'సుప్రియాపేరడీ' అనే 'ఎక్స్' అకౌంట్ నుంచి పోస్ట్ చేశారని.. దాని నిర్వాకులు ఎవరో తెలియదన్నారు. తన 'ఎక్స్'ఖాతా హ్యాక్ అయిందని తెలిపారు.అప్పటికే ఆమె పోస్ట్ వివాదస్పదం కాగా.. బీజేపీ నేతలు ఆమెపై మండిపడ్డారు. ఇలా మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనతేకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. మార్చి 29 సాయంత్రం 5 గంటలోపు స్పందించాలని కోరింది. ఇది మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల కోడ్)ని ఉల్లంఘించినట్లు పోల్ ప్యానెల్ తెలిపింది. మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేయాలని ఈసీ ఆదేశించింది.

# ఎన్నికల్లో 238 సార్లు ఓడాడు.. అయినా మళ్లీ పోటీకి సిద్ధమయ్యాడు

చెన్నై: సుమారు 35 ఏళ్లకుపైగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడు. ఇప్పటి వరకు 238 ఎన్నికల్లో పోటీ చేసిన అతడు అన్ని ఎన్నికల్లో ఓడిపోయాడు. ప్రపంచంలోనే అతిపెద్ద ఓటమి అభ్యర్థిగా రికార్డ్‌లోకి ఎక్కాడు. తన రికార్డ్‌ను పదిలం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న అతడు తాజాగా లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమయ్యాడు. తమిళనాడులోని మెట్టూరుకు చెందిన 65 ఏళ్ల కె పద్మరాజన్ (1988 నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడు. ఇప్పటి వరకు 238 ఎన్నికల్లో పోటీ చేసిన అతడు ఓటమిపాలయ్యాడు. అయినప్పటికీ తనకు గెలుపు ముఖ్యం కాదని ఎన్నికల్లో పోటీ చేయడమే ప్రధానమని చెబుతున్నాడు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులోని ధర్మపురి జిల్లా నుంచి పోటీకి సిద్ధమయ్యాడు.కాగా, 'ఎలక్షన్ కింగ్'గా పేరుగాంచిన పద్మరాజన్, రాష్ట్రపతి నుంచి స్థానిక ఎన్నికల వరకు దేశవ్యాప్తంగా అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడు. ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్




సింగ్, కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ వంటి రాజకీయ ఉద్ధండులపై కూడా పోటీ చేసి ఓడిపోయాడు. 'అభ్యర్థులంతా ఎన్నికలలో విజయం సాధించాలని కోరుకుంటారు. నేను మాత్రం కాదు. ఎన్నికల్లో పోటీ చేయడమే నా విజయం. ఓటమి పరంపరలో మళ్లీ ఓడిపోయినా సంతోషమే' అని అన్నాడు.మరోవైపు టైర్ రిపేర్ షాప్ నిర్వహించే పద్మరాజన్ హోమియోపతి మందుల అమ్మకంతోపాటు స్థానిక మీడియాకు ఎడిటర్‌గా కూడా పనిచేస్తున్నాడు. ఎన్నికల్లో నామినేషన్ కోసం ఇప్పటి వరకు లక్షలు చెల్లించిన అతడు అన్నిసార్లు డిపాజిట్ కోల్పోయాడు. 2011లో మెట్టూరులో అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేసినప్పుడు తన ఓటు తప్ప ఎవరూ వేయరని అనుకున్న ఆయన అత్యధికంగా 6,273 ఓట్లు సాధించాడు.కాగా, ఇప్పటి వరకు పోటీ చేసిన అన్ని ఎన్నికల్లో ఓడిపోయిన పద్మరాజన్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మాత్రం విజయం సాధించాడు. అత్యంత ఓటమి అభ్యర్థిగా రికార్డుకెక్కాడు. ఈ నేపథ్యంలో తన ఊపిరి ఉన్నంత వరకు ఎన్నికల్లో పోటీ చేస్తూనే ఉంటానని చెప్పాడు.

# అర్జెంటీనా అధ్యక్షుడి సంచలన నిర్ణయం..

**70 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులపై వేటు..!**



అర్జెంటీనా అధ్యక్షుడు జావియెర్ మిలీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాబోయే రోజుల్లో వేల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులను తొలగించాలని యోచిస్తున్నారు. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ నివేదించింది.ఆ నివేదిక ప్రకారం.. మరి కొద్ది నెలల్లో 70 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను తొలగించాలని జావియెర్ యోచిస్తున్నారు. ఆర్థికంగా ఉన్న సమస్యల్ని పరిష్కరించుకునేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు బ్లూమ్‌బర్గ్ నివేదిక తెలిపింది. ఆ దేశంలో ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల ఒప్పందం త్వరలోనే ముగియనుంది. గతేడాదే వీరి కాంట్రాక్ట్ ముగిసినప్పటికీ ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగించింది. అయితే, వీరి కాంట్రాక్ట్‌ను రెన్యువల్ చేసే ఆలోచన తమకు లేదని అధ్యక్షుడు గతేడాది డిసెంబర్‌లోనే ప్రకటించిన విషయం తెలిసిందే.ర్జెంటీనాలో మొత్తం 35 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. అందులో తొలగించే ఉద్యోగుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ వేల మందిని ఒకేసారి తీసేయాలని నిర్ణయించడమే ఆ దేశంలో ఇప్పుడు సంచలనమవుతోంది. అధ్యక్షుడి నిర్ణయంపై కార్మిక సంఘాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తోంది. ఇప్పటికే కొన్ని సంఘాలు ఆందోళనలు చేపడుతున్నాయి.


# బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ హౌస్ అరెస్ట్



హైదరాబాద్ : గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ హౌస్ అరెస్ట్ అయ్యారు. ఇటీవల అల్లర్లు చోటు చేసుకున్న చెంగిచెర్లకు గురువారం సాయంత్రం వెళ్తానని రాజాసింగ్ ప్రకటించారు. దీంతో ఆయన ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. రాజాసింగ్‌ను ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా పోలీసులు నిర్బంధించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని, ఇది మంచిది కాదన్నారు. బాధితులపై రివర్స్ కేసులు పెట్టడం దారుణమని రాజాసింగ్ అన్నారు.

# నోబెల్ అవార్డు గ్రహీత డానియెల్ కాహ్నేమాన్ కన్నుమూత

ప్రముఖ కాగ్నిటివ్ సైకాలజిస్ట్, నోబెల్ అవార్డు గ్రహీత డానియెల్ కాహ్నేమాన్ (90) కన్నుమూశారు. మనుషులు నిర్ణయాలు తీసుకునే విధానంపై లోతైన పరిశోధనలు చేసి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు.



కాహ్నేమాన్ మృతిపై ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజిమెన్ నెతాన్యాహు విచారం వ్యక్తం చేశారు. ఓ అత్యున్నత మేధావిని కోల్పోయామని, ఆయన పరిశోధన చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మనుషులు వాస్తవాలను ఎలా గ్రహిస్తారు? అనే విషయంలో ఆయన చేసిన పరిశోధన విప్లవాత్మకమైన మార్పులకు కారణమైందని పేర్కొన్నారు.ఆయన తదనంతరం పరిశోధన మానవాళికి ఎంతో ఉపయోగపడుతాయని.. భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. అయితే, అనిశ్చిత పరిస్థితుల్లో మనుషులు నిర్ణయాలు తీసుకునే తీరును ఆర్థికశాస్త్రంతో అనుసంధానం చేస్తూ ఆయన పరిశోధన చేపట్టారు. ఈ పరిశోధనకు గాను 2002లో నోబెల్ పురస్కారం దక్కింది. మనుషుల నిర్ణయాలు తార్కికంగా ఉంటాయని ఎకనమిక్ థియరీ భావిస్తే.. అనిశ్చిత పరిస్థితుల్లో భిన్నంగా ప్రవర్తిస్తారని తన పరిశోధనతో రుజువు చేశారు. కాహ్నేమాన్ పలు యూనివర్శిటీల్లో అధ్యాపక, పరిశోధన బాధ్యతలు నిర్వర్తించారు.

# సంకష్టహర చతుర్థి పూజలందుకున్న మహాగణపతి

**అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు**

మంథని,సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టత సంతరించుకుంది. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత సంకటహర చతుర్థి వస్తుంది. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు. అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు. ప్రతి మంగళవారం భక్తులు విగ్నేశ్వరుని పూజిస్తుంటారు. ముఖ్యంగా సంకటహర చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంకటహర చతుర్థి దీక్ష పట్టిన భక్తులు రాత్రి చంద్రోదయం అనంతరం మాత్రమే ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పల్లి రాము ఆలయానికి వచ్చిన భక్తులకు సంకల్పాలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆలయంలోని స్వామి వారిని అలంకరిస్తూ భక్తుల సౌకర్యార్థం అర్చకులు పల్లి సంజీవ్, పల్లి రాము సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# వైఎస్ కుటుంబంతో పోటీ సాధ్యమేనా

కడప, మార్చి 28 కడప జిల్లా పేరు చెప్పగానే అందరికీ గుర్తుకు వచ్చేది దివంగత ముఖ్యమంత్రి వైయస్‌రాజశేఖర్‌రెడ్డి కుటుంబమే. దశాబ్దాలుగా జిల్లాను ఏకచత్రాధిపత్యంతో ఏలిన వైఎస్ కుటుంబంలో...ఇప్పుడు ఆయన వారసుడు జగన్ సైతం ఆ పట్టుకోల్పోకుండా రాజకీయం నెరపుతున్నారు. వివిధ వ్యాపారాలు చేసిన జగన్ వందల కోట్లు కూడబెట్టారు. గత ఎన్నికల(2019) సమయంలో ఆయన ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ ప్రకారం జగన్ ఆస్తుల విలువ 510 కోట్లు కాగా...అప్పులు 74 కోట్లు పైగానే ఉన్నట్లు తెలిపారు. వివిధ బ్యాంకుల్లో జగన్ పేరిట ఉన్న బాండ్లు విలువ నాలుగుకోట్లపైనే ఉండగా....వివిధ సంస్థల్లో పెట్టిన పెట్టుబడులు, షేర్ల విలువ 381 కోట్లుగా ఉంది. మూడున్నర కోట్ల పర్సనల్ లోను అడ్వాన్స్ రూపంలో తీసుకోగా...దాదాపు పదికోట్ల విలువైన వజ్రాలు, బంగారం ఆభరణాలు ఉన్నాయి. ఇతర మార్గాల్లో ఆదాయం మరో 42 కోట్లు ఉంది. జగన్ మొత్తం చరాస్తుల విలువ 443 కోట్లు ఉంది. 70లక్షల విలువైన వ్యవసాయ భూమి ఉండగా...మరో 15 కోట్లు విలువైన వ్యవసాయేతర భూమి ఉంది. 24 కోట్ల విలువైన కమర్షియల్ బిల్డింగ్‌లు, 25 కోట్ల విలువైన ఇళ్లు ఆయన పేరిట ఉన్నాయి. మొత్తం స్థిరాస్తుల విలువ 66 కోట్లు ఉంది. వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పు, ఇన్‌కం ట్యాక్స్ చెల్లింపులు కలిపి 74 కోట్లు వరకు ఉంది.జగన్ మేనమామ, కమలాపురం వైసీపీ అభ్యర్థి పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డికి 40 కోట్లకుపైగా ఆస్తులు ఉన్నాయి. 14కోట్లు అప్పులు ఉన్నాయి. బ్యాంకు బ్యాలెన్స్, బాండ్లు, షేర్లు కలిపి 10 కోట్ల రూపాయల ఆస్తి ఉండగా... పర్సనల్‌లోన్‌గా బ్యాంకు నుంచి 16 కోట్ల రూపాయలు అప్పుగా తీసుకున్నారు. బంగారం, వాహనాలు అన్నీ కలిపి ఆయన చరాస్తుల విలువ 27 కోట్ల వరకు ఉంది. భూములు, ఇల్లు, స్థలాలు అన్నీ కలిపి పదమూడున్నర కోట్లు వరకు ఆస్తి ఉంది. వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పు 14 కోట్లు వరకు ఉంది. ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా ఆస్తులు దాదాపు 4 కోట్లు వరకు ఉన్నాయి. బాండ్లు, బ్యాంకులో క్యాష్, పర్సనల్ లోన్ అడ్వాన్స్‌లు కలిపి 2 కోట్ల 28లక్షలు ఉన్నాయి. వ్యవసాయ భూమి, వ్యవసాయేతర భూములు, ఇల్లు అన్నీ కలిపి మరో కోటి 62 లక్షల విలువైన ఆస్తులు ఉన్నాయి. వైసీపీ సీనియర్ నాయకుడు రాయచోటిఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి ఆరున్నర కోట్ల ఆస్తులు, రెండు కోట్ల అప్పులు ఉన్నాయి.బాండ్లు,షేర్లు విలువ 45 కోట్లు వరకు ఉండగా....మొత్తం చరాస్తులు కలిపి 47 కోట్లు ఆస్తి ఉంది. కోటి రూపాయల విలువైన వ్యవసాయ భూములు, రెండు కోట్లు విలువైన వ్యవసాయేతర భూములు, 9 కోట్లు విలువైన కమర్షియల్ బిల్డింగ్‌లు, 8 కోట్లు విలువైన ఇల్లు ఉన్నాయి. పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఎలాంటి అప్పులు లేవు. బీజేపీ నేత ఆదినారాయణరెడ్డికి మూడుకోట్ల ఆస్తులు ఉండగా...9 లక్షల అప్పు ఉంది.కడప ఎంపీగా మరోసారి వైసీపీ తరపున పోటీ చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డికి దాదాపు 19 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయి. రెండు కోట్ల వరకు అప్పులు ఉన్నాయి. వివిధ బ్యాంకుల్లో ఉన్న బాండ్లు కోటిన్నర వరకు ఉండగా... మరో రెండున్నర కోట్లు వరకు పర్సనల్‌లోన్ అడ్వాన్స్‌లు ఉన్నాయి. వాహనాలు, బంగారం ఆభరణాలు అన్నీ కలిపి మొత్తం చరాస్తుల విలువ 5 కోట్లు పైగానే ఉన్నాయి. 8కోట్లకు పైగా విలువైన వ్యవసాయ భూములు, కోటిరూపాయల విలువైన వ్యవసాయేతర భూమి ఉంది. నాలుగున్నర కోట్ల విలువైన ఇల్లు ఉన్నాయి. మొత్తం స్థిరాస్తుల విలువ పదమూడున్నర కోట్లు ఉంది. వివిధ బ్యాంకుల నుంచి అవినాష్‌రెడ్డి తీసుకున్న అప్పు 2 కోట్ల 28 లక్షలు ఉంది.రాజంపేట నుంచి వైసీపీ తరపున బరిలో ఉన్న మిథున్‌రెడ్డికి 66.5 కోట్ల ఆస్తులు ఉండగా...20 కోట్ల అప్పు ఉంది. బాండ్లు, షేర్ల రూపంలో 9 కోట్లు, పర్సనల్‌లోను అడ్వాన్స్ ద్వారా మరో ఐదుకోట్లు ఆస్తి ఉంది. మిగిలినవి అన్నీ కలిపి మిథున్‌రెడ్డికి 14.66 కోట్ల చరాస్తులు ఉన్నాయి. అలాగే 8 కోట్లు విలువైన వ్యవసాయ భూములు, 16 కోట్ల విలువైన వ్యవసాయేతర భూములు, హైదరాబాద్‌లో 28 కోట్ల విలువైన ఇల్లు మిథున్‌రెడ్డి పేరిట ఉన్నాయి. ఆయన మొత్తం స్థిరాస్తుల విలువ 52 కోట్లు వరకు ఉన్నాయి. వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పు 20 కోట్లకుపైగానే ఉంది. ఇక మిథున్‌రెడ్డిపై పోటీపడుతున్న ఎన్డీఏ అభ్యర్థి మాజీముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆస్తులు 2014 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం 18 కోట్లు వరకు ఉన్నాయి. ఆయన మొత్తం చరాస్తుల విలువ 5 కోట్లు ఉండగా...ఏడుకోట్ల విలువైన వ్యవసాయ భూములు, ఏడుకోట్ల విలువైన ఇల్లు ఆయన పేరిట ఉన్నాయి. మొత్తం స్థిరాస్తులు 14 కోట్లు ఉన్నాయి.

## చిత్తూరులో ఆల్ ఈజ్ నాట్ వెల్

తిరుపతి, మార్చి 28 ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాజకీయం చాలా ఆసక్తిగా మారుతోంది. వైసీపీ క్లారిటీతో ఎవరెవరికి సీట్లు ఇవ్వాలి ఎవర్ని పక్కన పెట్టాలనే అంచనాలతో ముందుగానే అందరికీ సంకేతాలు ఇచ్చేసింది. అనుకున్నట్టుగానే ఒకేసారి సీట్లు ప్రకటించేసింది. కానీ కూటమిగా ఏర్పాడిన టీడీపీ, జనసేన, బీజేపీలో మాత్రం సీట్లు కేటాయింపు జరిగిందే తప్ప ఇంకా సర్దుబాట్లు మాత్రం పూర్తి స్థాయిలో జరగలేదు. ఇంకా కొన్ని సీట్లపై అనేక పుకార్లు వినిపిస్తున్నాయి. నేతలు కూడా బహిరంగగానే చర్చించుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరును మూడు జిల్లాలుగా విభజించారు. ఇందులో తిరుపతి పార్లమెంటు పరిధిలో వైసీపీ నుంచి డాక్టర్ ఎం.గురుమూర్తి.. కూటమి నుంచి డాక్టర్ వి. వరప్రసాద్ రావు పోటీలో ఉన్నారు. గతంలో జరిగిన ఉప ఎన్నికల్లో గురుమూర్తి గెలుపొందారు. ఇప్పటికే తిరుపతి ఎంపీగా ఉండగా రెండోసారి వైసీపీ నుంచి ఎంపీ కావాలని కోరుకుంటున్నారు. వరప్రసాద్‌రావు తిరుపతి ఎంపీగా, గూడూరు ఎమ్మెల్యేగా వైసీపీలో పని చేశారు. అక్కడ సీటు లభించకపోవడంతో ఆదివారం బీజేపీలో చేరారు. అనూహ్యంగా ఆయన పేరు ఎంపీ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. చిత్తూరు జిల్లాకు సంబంధించి వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ రెడ్డప్ప రెండోసారి పోటీ చేస్తున్నారు. కూటమి నుంచి టీడీపీ తరపున దగ్గుమళ్ల ప్రసాద్‌రావు తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అన్నమయ్య జిల్లాలో రాజంపేట నుంచి సిట్టింగ్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి మరోసారి పోటీలో ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అభ్యర్థిగా కూటమి నుంచి పోటీ చేస్తున్నారు.సీట్లు పంపకాలు జరిగినంత ఈజీగా సర్దుబాట్లు జరగడం లేదన్నది కూటమి నేతలు చెబుతున్న మాట. ప్రస్తుతం జరిగిన సీట్ల పంపకాలపై మూడు పార్టీల నాయకులు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారు. తమను కాదని ఇతరులకు సీటు ఇవ్వడం.. వైసీపీ నుంచి వచ్చిన వారికి సీట్లు కేటాయించడం.. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఐదేళ్లపాటు ఇబ్బంది పెట్టిన వారికి తిరిగి పని చేయాలంటే ఎలా చేస్తామంటూ అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితిలో కూటమి అభ్యర్థులు ఎలా అందరిని కలుపుకొని ముందుకు వెళ్తారు అనేది ప్రస్తుతం చర్చ నడుస్తోంది. పార్టీ అధినాయకత్వం అన్ని పార్టీల వారిని బుజ్జగింపులు చేసింది.పార్టీ అధినాయకత్వం బుజ్జగిస్తున్నా... భయపెడుతున్నా దారికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. బయటకు సైలెంట్‌గా ఉన్నట్టు కనిపిస్తున్న కొందరు నేతలు తెరవెనుక ఎలాంటి గూడుపుఠాణి చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఉదాహరణకు తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులకు వ్యతిరేకంగా అన్ని పార్టీల నేతలు ఒక్కటయ్యారని టాక్ నడుస్తోంది. మంగళవారం ప్రత్యేక సమావేశం కూడా పెట్టుకున్నారని తెలుస్తోంది. ఆ సమావేశంలో ఏ నిర్ణయించుకున్నారో మాత్రం బయటకు రాలేదు. ఇలా కీలక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉందని... ఎవరు ఎప్పుడు ఎలాంటి స్టెప్ తీసుకుంటో అన్న భయం మాత్రం పార్టీల్లో ఉంది. బయటకు ఆల్ ఈజ్ వెల్ అంటున్నా లోలోపల మాత్రం రగిలిపోతున్నారు.

## పోలిట్ బ్యూరో సభ్యులు నియమితులైన రెడ్డి సుబ్రహ్మణ్యం కు అభినందనలు

అంబాజీపేట,మార్చి28' కొత్తపేట నియోజకవర్గం నకు చెందిన మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ రెడ్డి సుబ్రహ్మణ్యం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పోలీట్ బ్యూరో సభ్యులు గా నియమితులైన సందర్భంగాకొత్తపేటలోని ఆయన స్వగృహం లో రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్నం బాల విజయరావు పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లిబాలరాజురాష్ట్రఎంబీసీ డైరెక్టర్‌సంచార జాతుల (గంగిరె ద్దుల)యడ్లపల్లి తుక్కియ్య డాక్టర్ సెల్ అధ్యక్షులు గెల్లా అశోక్ ఎన్టీఆర్ యువసేనఅధ్యక్షులువక్కలం కబుల్లియ్య మోకా శ్రీనుతదితరులు కలిసిపుష్పగుచ్ఛంఅందజేసి ఘనంగా సత్కరించారు. పోలీట్ బ్యూరో సభ్యులు నియమితులయినందు కు అభినందనలు తెలిపారు.

## కమలంలో పాత నీరే పాయె




రాజమండ్రి, మార్చి 28 దగ్గుబాటి పురంద్రీశ్వరి బీజేపీ అధ్యక్షురాలిగా బాధ్యతలను చేపట్టనంత వరకూ పార్టీలో ఒక సీన్ ఉండేది. కొందరిదే ఆధిపత్యం. వారి నిర్ణయాలే అంతిమం. అధినాయకత్వానికి వారు ఇచ్చే నివేదికలను బట్టి కేంద్ర నాయకత్వం నిర్ణయాలు జరిగేవి. అందుకే జనసేన అధినేత పవన్ కల్యాణ్ 2019 ఎన్నికల తర్వాత పొత్తులు పెట్టుకున్నా రాష్ట్రంలో ఆ పార్టీతో కలసి ఎక్కడా పనిచేసిన దాఖలాలు లేవు. చివరకు తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక మినహా బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికల్లో పవన్ అడుగుపెట్టలేదు కూడా. నాటి రాష్ట్ర నాయకత్వం వైసీపీకి అండగా ఉంటూ అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటుందన్నది బీజేపీలో కొందరి వాదన.అయితే పురంద్రీశ్వరి అధ్యక్షురాలిగా బాధ్యతలను చేపట్టిన తర్వాత ఆ బ్యాచ్ మొత్తం మౌనముద్ర దాల్చింది. ఎక్కడా కనిపించడమూ లేదు. చిన్నమ్మ అంతా తానే అయి పార్టీ కోసం రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేపట్టారు. అధికార వైసీపీ లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తూ వచ్చారు. పొత్తుల అంశాన్ని పార్టీ చూసుకుంటుందని, తాము పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని మాత్రమే చెప్పుకుంటూ వచ్చారు. పురంద్రీశ్వరికి పాత నాయకులు ఎవరూ సహకరించలేదన్నది కాదనలేని వాస్తవం. అయినా ఆమె దేనినీ లెక్క చేయకుండా తన పని తాను చేసుకుని వెళుతున్నారు. కేంద్ర నాయకత్వం సూచనలతో ఆమె అడుగులు వేశారు.తాజాగా అభ్యర్థుల ఎంపిక చూసినా పాత బ్యాచ్ కు పురంద్రేశ్వరి చెక్ పెట్టినట్లుగానే కనపడుతుంది. సోము వీర్రాజు కు పోటీ చేసేందుకు స్థానం లేదు. రాజమండ్రి ఎంపీగా పోటీ చేయాలని భావించిన సోము వీర్రాజును తానే అభ్యర్థిగా పురంద్రీశ్వరి బరిలోకి దిగడంతో అవాక్కయ్యారు. అనపర్తి స్థానం ఖాళీగా ఉన్నప్పటికీ అక్కడి నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని నాయకత్వం చెప్పిందన్న వార్తలు వస్తున్నాయి. అయితే అక్కడి నుంచి పోటీ చేయడానికి సోము వీర్రాజు సుముఖత చూపడం లేదు. దీంతో ఆయనకు ఎక్కడ టిక్కెట్ ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. రాజమండ్రి రూరల్, అర్బన్ స్థానాలకు ఇప్పటికే టీడీపీ తన అభ్యర్థులను ప్రకటించింది.అదే సమయంలో జీవీఎల్ నరసింహారావు మూడేళ్ల నుంచి విశాఖలో ఎంపీగా పోటీ చేయడానికి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నారు. కానీ అది కూడా టీడీపీ ఖాతాలోకి వెళ్లిపోయింది. జీవీఎల్ కు ఇప్పుడు పోటీ చేయడానికి ఎక్కడా స్థానమే లేదు. మొన్న ఎంపీ అభ్యర్థుల ప్రకటనలో ఆయన ఊసే కనిపించ లేదు. ఇక పార్టీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి హిందూపురం లోక్‌సభ నుంచి పోటీ చేయాలనుకున్నారు. లేదంటే కదిరి అసెంబ్లీ స్థానంలో బరిలోకి దిగాలనుకున్నారు. కానీ ఆ రెండు టీడీపీ ఖాతాలోకే వెళ్లాయి. దీంతో విష్ణు కూడా ఈ ఎన్నికల్లో చేతులూపుకుంటూ తిరగాల్సిందే తప్ప పోటీ చేసే అవకాశమే లేదు. మొత్తం మీద చిన్నమ్మ పాత బ్యాచ్ కు చెక్ తన దైన రీతిలో పెట్టేశారన్న టాక్ మాత్రం పార్టీలో వినిపిస్తుంది.

## నెల్లూరు సీటీలో గెలిచోన్నళ్లదే బలమంతా

నెల్లూరు, మార్చి 28 ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ ఎంతో ప్రత్యేకమైనవి. జిల్లా వ్యాప్తంగా ఎవరు గెలిచినా, ఓడినా.. నగర నియోజకవర్గంలో గెలిచిన పార్టీకే పట్టు ఎక్కువగా ఉంటుంది. 2004 వరకు నెల్లూరు ఒకటే నియోజకవర్గం. 2009 నుంచి నెల్లూరు సిటీ, రూరల్ గా రెండు నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. రూరల్ నియోజకవర్గంలో కూడా సిటీలో ఉన్న కొన్ని డివిజన్లు కలుస్తాయి కానీ.. సిటీ నియోజకవర్గమే ఎక్కువగా వార్తల్లో ఉంటుంది. నెల్లూరు నియోజకవర్గం వామపక్షాలు మినహా అన్ని పార్టీలను ఆదరించింది. కాంగ్రెస్, టీడీపీ, భారతీయ జనసంఘ్, ప్రజారాజ్యం.. అన్ని పార్టీలకు ఇక్కడ ప్రాతినిధ్యం ఉంది. మొదట్లో ఇక్కడ ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఇక్కడ బోణీ కొట్టింది. మాజీ మంత్రి, ఏసీ సుబ్బారెడ్డిగా నెల్లూరు జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పిన ఆనం చెంచు సుబ్బారెడ్డి 1955లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆ తర్వాత కాల క్రమంలో ఆనం వెంకట రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, ఆనం వివేకానంద రెడ్డి కూడా నెల్లూరు సిటీ ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు నెల్లూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా పనిచేయడం విశేషం. అయితే ఇందులో ఆనం రామనారాయణ రెడ్డి మాత్రం టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు, మిగతా ముగ్గురు కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1967లో ఎం.ఆర్.అన్నదాత, భారతీయ జనసంఘ్ తరపున నెల్లూరు ఎమ్మెల్యేగా గెలిచారు. 1994లో తాళ్లపాక రమేష్ రెడ్డి కూడా నెల్లూరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడిగా తాళ్లపాక రమేష్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఫేమస్ అయ్యారు. ఆయనకు కూడా ఎన్టీఆర్ మంత్రి పదవి ఇచ్చారు. 2009లో నెల్లూరు సిటీ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి ప్రజారాజ్యం తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2014లో అనిల్ కుమార్ యాదవ్ వైఎస్సార్సీపీ తరపున ఎమ్మెల్యే అయ్యారు. 2019లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్.. జగన్ కేబినెట్ లో జలవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు.

## అంజలి మృతిపై స్పందించిన జిల్లా పోలీసులు

అనంతపురం ,అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన అంజలి మృతిపై మంగళవారం సోషల్ మీడియాలో వచ్చిన కథనంపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తక్షణమే స్పందించారు. బుదవారం అంజలి మృతి ఘటనలో ఆమె భర్త రాజు, బేల్దారులయిన దస్తగిరి, బాలులను అనంతపురం ఒన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మృతి ఘటనను సీరియస్ గా తీసుకున్న జిల్లా ఎస్పీ లోతుగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

## అనకాపల్లి ప్రచారంలో పాల్గోన్న నటుడు పృథ్వీరాజ్

అనకాపల్లి ,అనకాపల్లి బిజెపి తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, బిజెపి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్ కు ఎన్నికల ప్రచారంలో సినీ యాక్టర్ పృథ్వీరాజ్ పాల్గోంటున్నారు. పార్క్ సెంటర్ లోని ప్రతి ఒక్కరిని పలకరిస్తూ గాజు గ్లాస్ కి ఓటేసి అలాగే కమలంపై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే మోడీ, పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు లాంటి నాయకుడు అవసరమని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకొని అనకాపల్లి అభివృద్ధికి నాంది పలకాలని అన్నారు. వైసిపి ప్రభుత్వం వాల్ చేస్తున్న అరాచకాలు మొత్తం ఒక బుక్ ని త్వరలో రిలీజ్ చేస్తామని పృథ్వీరాజ్ తెలిపారు. అంబటి రాంబాబు జాతరలోని డాన్సు స్టెప్పులేసుకోవడానికి తప్ప అభివృద్ధి నోచుకోని నాయకుడిగా పేరు తెచ్చుకున్నావు. టూరిజం శాఖ మంత్రి రోజా జూన్ 4వ తారీఖున మీ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సంబరాలు నువ్వు చేస్తాము మీ కళ్ళతో నువ్వే చూడాలని అన్నారు.

### ఎన్నికల ప్రచారంప్రారంభించిన మంత్రి అమర్నాథ్

గాజువాక ,మంత్రి గుడివాడ అమర్నాథ్ గాజువాక నియోజకవర్గం లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముందుగా సత్తెమ్మ గుడిలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంటింటికి వెళ్లి గాజువాకలో అనేక సమస్యలను పరిష్కరించిన ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డి. రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యే గా గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఈ ప్రచార కార్యక్రమములో తిప్పల దేవన్ రెడ్డి, కేబుల్ మూర్తి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గోన్నారు.....

## పోలీసులపై మండిపడ్డ అఖిల ప్రియ



అళ్లగడ్డ,ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బస్సుయాత్రలోభాగంగామాజీ మంత్రి అఖిలప్రియ తన అనుచరుల తో హల్చల్ చేశారు. ప్రజా సమస్యలపై,ముఖ్యంగా రైతు సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇవ్వడానికి బయలుదేరిన అఖిలప్రియను శిరివెళ్ల పోలీసులు అడ్డుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఇరువర్గాల కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడం తో మాజీ మంత్రి అఖిలప్రియను శిరివెళ్ల పోలీసులు స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా అఖిల ప్రియ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి బయలుదేరిన నన్ను గంగుల ప్రభాకర్ రెడ్డి తన అనుచరులతో దాడులు చేయించాడని ఈ విషయమై నేను పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇవ్వడానికి వెళుతున్నానని,మరి పోలీసులుకంప్లైంట్ తీసుకుంటారా, లేదా చూడాలని వ్యాఖ్యానించారు.

## ఏపీలో మరో కంటైనర్ రాజకీయం

విజయవాడ, మార్చి 28 డ్రగ్స్ కంటెయినర్ వ్యవహారం హాట్ టాపిక్ గానే ఉండగానే.. మరో కంటెయినర్‌పై ఏపీ రాజకీయాల్లో చర్చ ప్రారంభమయింది. మంగళవారం సీఎం జగన్ క్యాంప్ ఆఫీసు దగ్గరకు ఓ కంటెయినర్ వచ్చింది. పోలీస్ స్టిక్కర్ తో ఆ కంటెయినర్ ఉంది. కానీ పోలీసు వాహనం కాదు. రిజిస్ట్రేషన్ నెంబర్ ను బట్టి ఆర్టీసీ వాహనంగా భావిస్తున్నారు. ఆ కంటెయినర్ .. సీఎం క్యాంప్ ఆఫీస్ గేట్ వద్ద కాస్త లోపలికి వెళ్లి వస్తువుల్ని దింపడమో.. లేకపోతే ఏదో లోడ్ చేసుకుని వెళ్లడమో జరిగింది. ఈ దశ్యాలు వెలుగులోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ విమర్శలు ప్రారంభించింది. అ కంటెయినర్‌లో ఏం తెచ్చారు.. ఏం తీసుకెళ్లారన్నదానిపై ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. ఆ పార్టీ సోషల్ మీడియా ఈ విషయంలో అనేక ప్రశ్నలు సంధిస్తోంది. అయితే ఈ అంశంపై వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియాలో స్పందించింది. ఆ కంటెయినర్.. వంట సామాన్లను తీసుకెళ్లిందని.. అది ప్యాంట్రీ కార్ అని స్పష్టం చేస్తూ వీడియో పోస్ట్ చేసింది. ఈ అంశంపై టీడీపీ నేత పట్టాభి మీడియా సమావేశంలో తీవ్ర ఆరోపణలు చేశారు. కంటెయినర్‌లో అట్టపెట్టెల్లో డబ్బుల కట్టలున్నాయని వాటిని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు తీసుకెళ్లారన్నారు. సీసీటీవీ ఫుటేజీలు బయట పెట్టాలని పట్టాభి డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ఆ వాహనాన్ని ఎవరూ తనిఖీ చేయకపోవడం వివా?దాస్పదమవుతోంది. తన వాహనాన్ని ఉదయం సాయంత్రం తనిఖీలు చేస్తున్న పోలీసులు ఆ వాహనాన్ని ఎందుకు తనిఖీ చేయలేదని ట్విట్టర్‌లో ప్రశ్నించారు. సీఎం జగన్ ఇంటి దగ్గరికి వెళ్లిన కంటెయినర్‌ను ఎందుకు తనిఖీ చేయలేదని ప్రశ్నించారు. నిబంధనలు ఎందుకు పాటించలేదని నిలదీశారు. ఆ కంటెయినర్‌లో ఏముందని ప్రశ్నించారు.

# కోడుమూరులో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి..

**టికెట్ ఎవరికి వచ్చిన అందరూ కలిసి పని చేయాలి..**
**కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్..అనంతరత్నం..**



కర్నూలు జిల్లా ప్రతినిధి మార్చి 28 విభారె న్యూస్.. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో అందరం కలిసికట్టుగా పనిచేసి కోడుమూరులో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం తెలియజేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కోడుమూరు నియోజకవర్గ సమీక్ష సమావేశంలో అనంతరత్నం మాట్లాడుతూ కాంగ్రెస్ టికెట్టు ఎవరికి వచ్చిన అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అధిష్టానం నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని కోడుమూరులో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని మన సత్తా చాటాలని అభ్యర్థులకు పిలుపునిచ్చారు. బిజెపి, వైసిపి, టిడిపి లకు ఓట్లు వేసిన ఎస్సీలకు స్వేచ్ఛ ఉండదని కాంగ్రెస్ పార్టీలో మాత్రమే అందరికీ స్వేచ్ఛ స్వతంత్రం ఉంటుందని తెలియజేశారు. మన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ మతతత్వ పార్టీ అయిన బిజెపితో చేతులు కలిపి ఎస్సీ ఎస్టీ మైనార్టీల మనోభావాలను దెబ్బతీసే విధంగా చేసిందని విమర్శించారు. కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు వస్తే ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి పశ్చిమ ప్రాంతాలు అభివృద్ధి చేస్తుందని గుండ్రేవుల ప్రాజెక్ట్ పూర్తి చేస్తుందని, వలసలను నివారిస్తుందని, ప్రతి కుటుంబంలోని మహిళకు సంవత్సరానికి లక్ష రూపాయలు గృహలక్ష్మి పథకం కింద ఇస్తుందని, 500 కే వంటగ్యాస్ ఇస్తుందని, మహిళలకు రాజకీయాలలో మరియు ఉద్యోగాలలో యాభై శాతం రిజర్వేషన్ కల్పించి అమలు చేస్తుందని, రైతులకు రుణాలు మాఫీ చేస్తుందని కోడుమూరు నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి మీ సమస్యలు పరిష్కరించుకోవాలని అనంతరత్నం అభిప్రాయపడ్డారు. అనంతరం మాజీ మంత్రి మూలింటి మారెప్ప మాట్లాడుతూ మతతత్వ బిజెపి పార్టీని, మతతత్వ బిజెపి పార్టీతో పొత్తు పెట్టుకున్న ప్రాంతీయ పార్టీలను చిత్తుగా ఓడించాలని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయని వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ మాట్లాడుతూ నేటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావిశ్వాసం కోల్పోయాయని ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని అందుకే దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలియజేశారు. అనంతరం డిసిసి గౌరవాధ్యక్షులు ఉండవల్లి వెంకటన్న మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో దేశ ప్రజలలో రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని తపన మొదలైందని వచ్చే ఎన్నికల్లో ప్రజలు బిజెపిని చిత్తుగా ఓడించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని అనుకుంటున్నారని దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ డిసిసి గౌరవాధ్యక్షులు ఉండవల్లి వెంకటన్న ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్, డిసిసి కోఆర్డినేటర్ శశిధర్ వసి బాషా కోడుమూరు నియోజకవర్గ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపాలు, శ్రీనివాసులు, మల్లికార్జున, ఖలీల్, కోడుమూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ మిన్నెల్లా హుస్సేన్, బాలముని, కర్నూల్ సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లలిత కోడుమూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు హైమావతి హరి మా భాష చాంద్ బాషా గోవర్ధన్ నడిపిన నడిపెన్న సలోమి మొదలగు వారు పాల్గొన్నారు.

## శ్రీశైల మల్లన్న హుండీల ఆదాయం లెక్కింపు....



శ్రీశైలం మార్చి 28 విభారె న్యూస్..శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల హుండీల ఆదాయాలను గురువారం లెక్కించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. భక్తులు గత 16 రోజులలో సమర్పించిన కానుకల్లో రు. 1,81,13,485 నగదుతో పాటు వివిధ దేశాలకు సంబంధించిన విదేశీ కరెన్సీ ఆదాయంగా చేకూరినట్లు చెప్పారు. పటిష్టమైన భద్రత, సీసీ కెమెరాలు నిఘా మధ్య హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఆయన పేర్కొన్నారు.

## ప్రశాంతంగా సంస్కృతం పరిక్షా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28 – నంద్యాల జిల్లానందుసంస్కృతంపరీక్షప్రశాంతంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు సజావుగా నిర్వహించబడినవి అని డీఈ వో సుధాకర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు . నంద్యాల జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలలో3131 విద్యార్థులకుగాను 3117 విద్యార్థు లు పరీక్షకు హాజరుకావటం జరిగిందన్నారు. 14 మంది విద్యార్థులు గైర్హాజరు కావడం జరిగింది . జిల్లా వ్యాప్తంగా 03 ఫ్లయింగ్స్క్వాడ్టీంలు14 పరీక్షాకేంద్రాలను సందర్శించారని తెలిపారు . మొత్తం 14 పరీక్షా కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. సమస్యాత్మాక కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి సజావుగా పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.

## పట్టణ సుందరీకరణకు సహకరించండి

**అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28– నంద్యాల పట్టణ సుందరీకరణకు పట్టణంలో ఉన్న స్థల యజమానులు సహకరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి పేర్కొన్నారు . గురువారం మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని నివాస. నివాసేతర గ్రుహల యజమాను దారులకు తమ భవనాలకు సంబంధించిన ఇంటి పన్ను ఖాళీ స్థలం పన్ను. కుళాయి పన్ను ఈ నెల 31 వతేదిన లోపల చెల్లించాలని లేని యెడల మీ ఇండ్ల కు సంబంధించిన కుళాయిలను ఎటువంటి నోటీసులు జారీ చేయకుండానే తాత్కాలికంగా తోలగిస్తామని అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి హెచ్చరించారు . పట్టణ ప్రజలు వివిధ పన్నులను త్వరగా కట్టాలని కోరారు . 2023– ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి2024– మార్చి 28–వ తేదీ వరకు ఆస్తి పన్ను 15 కోట్ల యాభై లక్షలు వసూలు అయ్యాయని తెలిపారు. అలాగే నీటి పన్ను ఇప్పటి వరకు 2 కోట్ల డెబ్బై ఆరు లక్షలు వసూలు అయ్యాయి. వివిధ ప్రభుత్వ కార్యాలయాల నుండి మున్సిపాలిటీ కి పన్నుల రూపంలో దాదాపు 4 కోట్ల బకాయిలు రావలసి ఉందన్నారు. వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. మున్సిపాల్టీ కి రావలసిన రాబడికి రీచ్ అవుతామని అన్నారు. పట్టణ ప్రజలు వడ్డీ మాఫీ ఈ నెలాఖరు వరకు గడువు ఉందన్నారు. వడ్డీ మాఫీ ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## ఉడిపి పలిమారు పిఠాధిపతి శ్రీ విద్యాదీశ స్వామి30 న కర్నూలు రాక






విభారే న్యూస్.కర్నూల్ . మార్చి 28 శనివారం 30వ తేది ఉడిపి శ్రీకృష్ణఅష్ట మఠం లలో ఒకటి అయిన పలిమారు మఠం పీఠం అధిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యాదీశ తీర్థ స్వామి వారు ఉత్తరాది కారి శ్రీ విద్యా రాజేశ్వరా తీర్థ స్వామి వారు కర్నూలు నగరం వెంకట రమణ కాలనిలో ఆచార్య మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్య స్మారక వేద విద్యా భవన్ భూమి పూజ కార్యక్రమం కు విచ్చేస్తున్నారని స్థల దాతలు సాహితి సమితి అధ్యక్షులుకూరడిచంద్రశేఖర్ గారు తెలిపారు. ఈ స్థలములో అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం వారు భవనం నిర్మించి వేద పాఠశాల నిర్వహిస్తారని తెలిపారు పర్యటన లో భాగంగా స్థానిక సంకల్ బాగ్ హరిహర క్షేత్రం లో వెంకటేశ్వర స్వామి దేవాలయం లో స్వామి వారు ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం 10 గంటలకు వేద విద్యా భవన్ భూమి పూజ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో భక్తులు అందరు పాల్గొని స్వామి వార్ల దర్శనం చేసుకొని స్వామి వారి అనుగ్రహం పొందాలని కోరారు ఈ కార్యక్రమం లో కరివేన సత్రం కార్యవర్గ సభ్యులు హెచ్ కె మనోహర రావు కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్ కె రాజశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు

## పారిశుధ్య నిర్వహణపై తనిఖీలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28– పారిశుధ్య నిర్వహణపై తనిఖీలు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి గురువారం మూలసాగరం. నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జిల వద్ద. మరియు టెక్కే పరిసర ప్రాంతాల్లో అక్కడ జరుగుతున్న శానిటేషన్ పనులను డ్రైనేజీ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాలువల్లో వ్యర్థాలు చెత్త చెదారంవేయడంవల్లమురికి కాలువలు నిండి పోతున్నా యని ఆయన అన్నారు. ప్రజలు చెత్త చెదారం కాల్వల్లో వేయడంమానుకోవాలనిసూచించారు. వేసినవారికి నోటీసులు జారీచేయాలని సిబ్బంది కి సూచించారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపర్వైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి . సచివాలయ సిబ్బంది. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గుర్రపు డెక్కతో నంద్యాలకు పెను ముప్పు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28– నంద్యాల పడమటి దిక్కున ఉన్న కుందూ నదిలో గుర్రపు డెక్క విస్తరించింది దీని ప్రభావం తో కుందూ నదిలో నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుర్రపు డెక్క ప్రభావంతో నీటి పారుదల ముందుకు సాగడం నిలిచి పోతుందని దాని ప్రభావం తో నంద్యాలలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవకాశం ఉందని అంటున్నారు. అధికారులు వర్షా కాలం రాక మునుపే స్పందించి వెంటనే గుర్రపు డెక్క ను పూర్తిగా తోలగించాలని స్థానికులు కోరుతున్నారు. లేనిచో నంద్యాల కు పెను ముప్పు సంభవిస్తుందని తెలిపారు.

## ఏప్రిల్ 12 నుంచి ప్రాజెక్టుల సందర్శన బొజ్జా దశరథరామిరెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28 – రాయలసీమ ప్రాజెక్టుల పరిస్థితి నానాటకి దిగుజారుతున్నదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నంద్యాల సమితి కార్యాలయంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి త్రాగు, సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు మంచినీటి ప్రాజెక్టులుగా, పాలకుల విధానాలతో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు ఉత్సవ విగ్రహాలుగా మారే పరిస్థితులను రాయలసీమ సమాజం దృష్టికి తీసుకొని పోవడానికి ఏప్రిల్ 12 వ తారీఖు నుండి ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన ప్రకటించారు. ఏకైక రాజధాని, మూడు రాజధానుల విధానాలను పాలకులు కేవలం తమ ఆర్థిక, రాజకీయ సామ్రాజ్యాలను విస్తరించుకోవడానికి అమరావతి, విశాఖలో ఏర్పాటుకై చేపట్టారని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాయలసీమ అభివృద్ధికి, రాయలసీమ యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేసే ఈ విధానాలను ప్రజలకు వివరించే కార్యక్రమం చేపడుతున్నామని ఆయన వివరించారుఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, రాయలసీమ సాగునీటి సాధన సమితి కర్నూలు కార్యనిర్వాహక సభ్యులు డేవిడ్, జనచైతన్య వేదిక నాయకులు శేషాద్రి రెడ్డి, రాయలసీమ ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు రామకృష్ణా రెడ్డి, శివ శంకర్ గౌడ్, లాయర్ క్రిష్ణారెడ్డి, కొమ్మా శ్రీహరి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

## భేటి బచావో- భేటి పడావో.. సిడిపిఓ సఫేరిన్నీస బేగం...

ఎమ్మిగనూరు మార్చి 28 విభారె న్యూస్..ఎమ్మిగనూరు మండలంలో సిడిపిఓ సఫ్ఫారిన్నీస బేగం ఆధ్వర్యంలో హెల్త్ అస్సిసెంట్, మహిళ పోలీస్ లకు, ఆశా వర్కర్స్ అంగన్వాడీ కార్యకర్తలు కు ఈ కార్యక్రమమును నిర్వహించారు ఆడపిల్లను రక్షిదాం–ఆడపిల్లను చదివిద్దాం బాల్య వివాహాలను అరికట్టుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అలాగే ఆడపిల్ల అని లింగ వివక్షత అరికట్టాలి చదువులో మంచి పోత్సాహము ఇచ్చి ముందుకు నపించాలి ఆరోగ్య విషయములో తల్లిదండ్రులు రక్తహీనత కు గురి కాకుండా మంచి పౌష్టికాహారం వారికి అందించాలి గర్భస్రావం తల్లి మరణాలు నివారించడనికి ఆడపిల్లకు 18 సంవత్సరం లు నిండిన తరువాతే వివాహము చేయాలి ఆడపిల్లకు చదువు ,క్రీడ రంగములో భవిషత్ విషయాలలో పూర్తి స్వచ్ఛ ని వారికి అందించి వారికి ఆరోగ్య కరమైన ఆనంద జీవితాన్ని ఇవ్వాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిడిపిఓ సఫరిన్నిసా,సూపర్ వైజర్స్ జరీనా, సూపర్వైజర్ గురు శేఖరమ్మ, హెల్త్ కోర్డానైట్స్ పాలుగొన్నారు.





## ఆత్మకూరు పట్టణం నందు మార్చి 30 వ తారీకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఆత్మకూరు పట్టణం నందు గల స్థానిక సిఎస్ఐ చర్చ్ నందు గురువారం ఉదయం 10 గంటలకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం గురించి సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి పాస్టర్ ఐజక్ బాబు అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తును శిలువ వేయడం గురించి మరియు పునరుతానం గురించి తెలియజేసేందుకు ప్రతి ఏటా నిర్వహించే కార్యక్రమం నిర్వహిస్తున్న ఈ కార్య క్రమంను మార్చి 30వ తారీకు శనివారం ఉదయం 7 గంటలకు ఆత్మకూరు సీఎస్ఐ చర్చి ఇంద్రానగర్ నుండి ప్రారంభమై ఆత్మకూర్ ఏ బీ మ్ చర్చ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగు తుందని పాస్టర్లు ఇస్సాకు బాబు, జయరాజు, సంపూర్ణ రావ్, తెలిపారు ప్రతి సంవత్సరం పవిత్ర శనివారం నాడు అంటే గుడ్ ఫ్రైడే కి ముందు రోజు ఈస్టర్ ఆదివారం రోజు నడుమ ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190